క్లుప్తంగా

వైభవంగా మాస శివరాత్రి పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామ తీర్థం సీతారామస్వామి దేవస్థాన క్షేత్ర పాలకుడిగా విరాజిల్లితున్న ఉమా సదాశివాలయంలో శుక్రవారం మాస శివరాత్రి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో ముందుగా గణపతి పూజ నిర్వహించి, అనంతరం ఉమా సదాశివుడికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి వివిధ రకాల ఫల రసాలతో విశేష అభిషేకాలు జరిపించారు. అనంతరం స్వామి సన్నిధిలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, విశేష హోమాలు చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

మండల కన్వీనర్ గదలకు అభినందనలు



గదల సన్యాసినాయుడును సన్మానిస్తున్న నాయకులు

నెల్లిమర్ల రూరల్: జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు మండలకో ఆర్డినేటర్‌గా నియమితులైన గదల సన్యాసినాయుడును వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు కొండవెలగాడలోని ఆయన స్వగృహంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ గదల సన్యాసినాయుడు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి పార్టీ పెద్దలు ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ సైకాలజీతో లోతైన పరిశోధన

నెల్లిమర్ల రూరల్: ఫోరెన్సిక్ సైకాలజీతో లోతుగా నేర పరిశోధన చేయవచ్చని జైన్ విశ్వవిద్యాలయ ప్రతినిధి అనీషా చంద్రన్ అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో ఫోరెన్సిక్ విభాగంలో చదువుతున్న విద్యార్థులకు వర్చువల్ విధానంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఫోరెన్సిక్ విభాగంలో విద్యార్థులు రాణించాలంటే నైపుణ్యంతో కూడిన విధానాలు అవలంభించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ, పారా మెడికల్ డీన్ ఆచార్యులు, విభాగాధిపతి చవాన్, తదితరులు పాల్గొన్నారు.

దయ చూపాలి



పశు వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పశు సంవర్థక శాఖాధికారి వెంకటరమణ

విజయనగరం ఫోర్ట్: జంతువుల పట్ల జాలి, దయ చూపాలని జిల్లా పశు సంవర్థక శాఖాధికారి వైవీ రమణ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక గో శాలలో జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జంతువులకు వచ్చే వ్యాధులను సకాలంలో గుర్తించి చికిత్స చేయించాలన్నారు. కార్యక్రమంలో డీడీ వి.వి. భాస్కరరాజు, ఎ.డి కేవీ రమణ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ మోహనరావు, గోశాల అధ్యక్షుడు హమ్మత్ లాల్, ఎ.డి డాక్టర్ ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: ధర్మపురి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎస్ఈ పి. నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రదీప్‌నగర్, వసంత్ విహార్, పద్మావతినగర్, ఎస్‌వీఎన్ నగర్, బియ్యాలపేట, నోబుల్ నగర్, కమాలనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

29న విజయభావన సాహితీ సదస్సు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 29న రాజీవ్‌నగర్ కాలనీ రోడ్డులో ఉన్న గాయత్రీభవన్‌లో సాహితీ సదస్సు నిర్వహించనున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శతవాధాని ఉప్పలధడియం భరతశర్మ (తిరుపతి) ఆధ్వర్యంలో అవధాన వాణీవిలాసం అనే అంశంపై ప్రాశ్నిక పరిషత్తు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షుడు నారాయణం శ్రీనివాస్ పాల్గొంటారన్నారు. ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకు జరగనున్న సదస్సుకు సాహితీవేత్తలందరూ హాజరుకావాలని కోరారు.

సంక్షేమ పథకాలతో సుభిక్షం

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



వెలుదూరులో బుక్‌లెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందుతుండడంతో ప్రజలందరూ సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని వెలుదూరు, కాలపరెడ్డిపేట, కిలుగుపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన అందిస్తుండడంతో ఇతర రాష్ట్రాల చూపు మన రాష్ట్రం వైపు ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలే మంత్రంగా వచ్చే సార్వత్రిక ఎన్నికలకు వెళ్తామని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం వరకు అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని తెలిపారు. కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, వైస్ ఎంపీపీ ఎస్.సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, నాయిని సత్యవతి, దారపు గున్నారెడ్డి, గుజ్జు సురేష్‌రెడ్డి, ఎడ్ల రామకృష్ణ, గాబు సూరప్పన్నరెడ్డి, కోరాడ మహేష్, దేశెట్టి గణేష్, టొంపల సీతారాం, చాపల సత్తిబాబు, దారపు అప్పలరెడ్డి, నాయిని శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆల్వార్‌దాస్ చిరస్మరణీయుడు



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

విజయనగరం: వాకర్స్ క్లబ్‌లను స్థాపించి మానవాళి ఆరోగ్య పరిరక్షణకు కారకుడైన సుంకర ఆల్వార్‌దాస్ చిరస్మరణీయులని తోష్నీవాల్ వాకర్స్ క్లబ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దాట్ల సన్యాసిరాజు అన్నారు. తోష్నీవాల్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ వ్యవస్థాపకుడు ఆల్వార్‌దాస్ 20వ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దాట్ల సన్యాసిరాజు మాట్లాడుతూ, ఆల్వార్‌దాస్ స్థాపించిన వాకర్స్ క్లబ్బులు నేడు ప్రపంచ వ్యాప్తంగా సేవలందిస్తుండడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వాకర్స్ గవర్నర్ సత్యం మాట్లాడుతూ, 1986లో విశాఖపట్నంలో ప్రారంభించిన ఈ నడక ఉద్యమం వాకర్స్ క్లబ్‌లుగా విస్తరించి ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య పరిరక్షణతో పాటు సామాజిక సేవలు అందిస్తున్నాయని తెలిపారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. అంతకుముందు ఆల్వార్ దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు చిరంజీవిరావు, పెద్దింటి అప్పారావు, ఎస్ఎస్ఎస్ఎస్ రాజు, పప్పు విశ్వనాథం, బసవమూర్తి, డి.శ్రీరామ్మూర్తి, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

21న బ్రాహ్మణ సమాఖ్య సమావేశం

విజయనగరం టౌన్: విశాఖ ఆర్‌కే బీచ్ రోడ్డులో ఉన్న అంబికా సీ గ్రీన్ హోటల్‌లో రాష్ట్ర బ్రాహ్మణ సమాఖ్య సర్వసభ్య సమావేశం ఈ నెల 21న నిర్వహించనున్నట్లు సమాఖ్య జిల్లా ప్రధానకార్యదర్శి గన్నవరపు శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ అధ్యక్ష్యతన, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ నిర్వహణలో నిర్వహించే సమావేశానికి 26 జిల్లాల నుంచి సమాఖ్య ప్రతినిధులు హాజరవుతున్న నేపథ్యంలో, జిల్లా నుంచి అధిక సంఖ్యలో ప్రతినిధులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. పెండింగ్ సమస్యలు, కమిటీల పనితీరు, డిమాండ్లు, తదితర అంశాలపై సమావేశంలో చర్చిస్తారని పేర్కొన్నారు.

స్కూల్ గేట్లు ప్రారంభం



గేటును ప్రారంభిస్తున్న సర్పంచ్ గాలి నరసయ్యమ్మ

భోగాపురం: మండలంలోని తూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ప్రహరీకి సుమారు రూ.3 లక్షల వ్యయంతో దివీస్ కంపెనీ వారు సమకూర్చిన గేట్లును సర్పంచ్ గాలి నరసయ్యమ్మ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: మండలంలో 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై నిర్వహించే సామాజిక తనిఖీలపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, వేతనదారుల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వారికి వివరించాలన్నారు. పనుల నిర్వహణపై సమగ్రంగా పరిశీలన చేసి గ్రామసభల్లో వెల్లడించాలని సామాజిక తనిఖీలు చేపట్టే బృంద సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, సామాజిక తనిఖీ అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఔత్సాహిక వ్యాపారవేత్తలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారులు

విజయనగరం టౌన్: ఆర్టీసీకి సంబంధించిన ఖాళీ స్థలాలను 15 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు ఔత్సాహిక వ్యాపారవేత్తలతో శుక్రవారం స్థానిక ఆర్టీసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. చీపురుపల్లి, గజపతినగరం, కొత్తవలస, విజయనగరం, ఎస్.కోట, తదితర ప్రాంతాల్లో ఉన్న స్థలాలు లీజుకు ఇచ్చేందుకు చర్చించారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్. రవికుమార్, ఈఈ రాజు, పార్వతీపురం డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు, సుధాకర్, విజయనగరం డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, డిప్యూటీ ఈఈ శ్రీనివాసరావు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థపై విషపురాతలు తగవు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల చెంతకు ప్రభుత్వ పథకాలు, సేవలు చేర్చుతున్నారని, అటువంటి వలంటీర్ వ్యవస్థపై రెండు ప్రధాన పత్రికలు, ఒక టీవీ ఛానల్(సాక్షి కాదు) విషపురాతలు రాస్తున్నాయని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆ రెండు పత్రికలు, టీవీ ఛానల్లు కలిసి వారి సామాజిక వర్గానికి చెందిన చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రభుత్వంపై, వలంటీర్ వ్యవస్థపై విషపురాతలు రాస్తున్నారని, కానీ ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హుల ఇంటి వద్దకే చేరవేస్తూ.. దేశానికే ఆదర్శంగా నిలిచిన వలంటీర్ వ్యవస్థపై తప్పుడు రాతలు తగవన్నారు. ఆనాడు చంద్రబాబు పాలనలో లంచం లేనిదే పని జరిగేది కాదని, గద్దల్లా ప్రజలను పీడించుకు తిన్న జన్మభూమి కమిటీలపై ఒక్క మాట కూడా ఆ రెండు పత్రికలు రాయలేదని దుయ్యబట్టారు. ఎలాగయినా చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించడానికి ఆ పత్రికలు నానాతంటాలు పడుతున్నాయని అన్నారు. రూ.2లక్షల కోట్లును ప్రజలకు సంక్షేమ పథకాల రూపంలో నేరుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల కాతాల్లో జమ చేసి పేదలకు అండగా నిలిస్తే.. అది చూసి ఓర్వలేక బురద జల్లే ప్రయత్నం టీడీపీ చేయడం సరికాదని విమర్శించారు. రామోజీ, టీడీపీ దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్, రెండు పత్రికలు కలిసి వచ్చి ఎన్నిరాతలు రాసినా, రాజకీయ కుట్రలు పన్నినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏమి చేయలేరని బొత్స వారిని హెచ్చరించారు. కార్యక్రమంలో నారాయణమూర్తిరాజు, స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గారతవుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు బూడి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, సీనియర్ నేతలు మండల సురేష్, బెల్లాన త్రినాథరావు, రేగసురేష్(గోవింద), కర్రి రాములునాయుడు పాల్గొన్నారు.

ఆదర్శ పంచాయతీగా నందిగాం

- డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి



నందిగాంలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి

భోగాపురం: మండలంలోని నందిగాం పంచాయతీ జిల్లాలో ఆదర్శ పంచాయతీగా ఎన్నిక కావడం శుభ పరిణామమని డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి అన్నారు. భోగాపురం పంచాయతీలో జరుగుతున్న పాలబంద ఎంఐ ట్యాంక్ పనులతో పాటు నందిగాం పంచాయతీలోని గ్రామ సచివాలయాన్ని, చెత్త నుంచి తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. నందిగాంను ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దిన సర్పంచ్ గరే మురళీ మోహన్‌తో పాటు సచివాలయ సిబ్బందిని అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, పంచాయతీలో చేపడుతున్న ఎంఐ, అమృత్ సరోవర్ ట్యాంక్, ఫారమ్ పాండ్స్, సోప్‌పిట్స్, హార్టీ/సెరీకల్చర్ పనులకు నిధులు మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ ఆదిబాబు, జేఈ చుక్క వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న రవాణా శాఖ ఉప కమిషనర్ సుందర్

- రవాణా శాఖ ఉప కమిషనర్ సుందర్

విజయనగరం క్రైమ్: మెడికల్ క్యాంపుల ద్వారా అందించే ఉచిత సేవలను డ్రైవర్లు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రవాణా శాఖ ఉప కమిషనర్ సుందర్ సూచించారు. శుక్రవారం స్థానిక రవాణాశాఖ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీపీ, సుగర్, నేత్ర సంబంధిత సమస్యలకు సంబంధించిన టెస్ట్‌లు చేయించుకుని, మందులు తీసుకోవాలన్నారు. డ్రైవర్లు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 96 మంది డ్రైవర్లను పరీక్షించి, ఎనిమిది మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆర్‌టిఓ ఆదినారాయణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక



కొత్త కార్యవర్గ ప్రతినిధులు

విజయనగరం టౌన్: విజయనగరం ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం స్థానిక గురజాడ గ్రంథాలయంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కంది శ్రీనివాసుల నాయుడు, ఉపాధ్యక్షుడిగా జశ్వంత్, కార్యదర్శిగా పి. అరవింద్, కోశాధికారిగా మల్లికార్జునరావులను ఎన్నుకున్నారు. వీరితో పాటు జాయింట్ ట్రెజరర్‌గా గంటా రాజు, కార్యవర్గ సభ్యులుగా ఈశ్వరరావు, సత్యం, సాయి, సతీష్, రాజులను ఎంపికయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జి. శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో ప్రమాదాల నివారణ

- రోడ్ సేఫ్టీ ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు అప్పారావు



విజయనగరం టౌన్: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు



విజయనగరం క్రైమ్: రింగురోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు



విజయనగరం క్రైమ్: ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న మజ్జి అప్పారావు, తదితరులు

<u>విజయనగరం క్రైమ్:</u>

అవగాహనతోనే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునని రోడ్ సేఫ్టీ ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు మజ్జి అప్పారావు అన్నారు. శుక్రవారం స్థానిక కాంప్లెక్స్ వద్ద ఉన్న ఆటో, కారు, క్యాబ్ డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా సేఫ్టీ ఎడ్యుకేషన్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ సభ్యులు దేవరశెట్టి శ్రీరామూర్తి, జి.రాంబాబు, నారాయణరావు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

విజయనగరం క్రైమ్: రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో పోలీస్ అధికారులు వివిధ కళాశాలలను సందర్శించి విద్యార్థులతో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. రహదారి భద్రతా నియమాలు పాటించడం వల్ల ప్రమాదాలను నివారించగలమన్నారు. అదేవిధంగా ఆటో, లారీ డ్రైవర్లకు స్థానిక వైద్యులతో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ట్రాఫిక్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాల్సిందే

విజయనగరం టౌన్: రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాల్సిందేనని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు స్పష్టం చేశారు. స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారి భద్రతావారోత్సవాల్లో భాగంగా డ్రైవర్లు రహదారి భద్రతా నియమాలు పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. మితిమీరిన వేగం, నిర్లక్ష్యధోరణి పనికిరావని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు..



మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

రేగిడి: ప్రజలను తప్పుదోవ పట్టించేలా రాష్ట్రంలోని ఎల్లోమీడియా రాతలు ఉన్నాయని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు విమర్శించారు. మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. వలంటీర్ల ద్వారానే అర్హులైన ప్రతి ఒక్కరి ఇంటికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందజేయడం జరుగుతోందన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి, వలంటీర్లు అందించిన సేవల వైపు ప్రపంచమంతా చూసి మెచ్చుకుందన్నారు. అటువంటి వ్యవస్థపై ప్రతిపక్ష టీడీపీ, ఎల్లోమీడియా తప్పుడు భావన ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెంటే రాష్ట్ర ప్రజానీకమంతా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీదే విజయమని జోష్యం చెప్పారు.